
ప్రజాశక్తి
సోమవారం 27 అక్టోబర్ 2025
5
విజయనగరం



27, 28, 29 తేదీల్లో విద్యాసంస్థలకు సెలవులు

విజయనగరంటౌన్ : తుపాను కారణంగా కలెక్టర్ రామసుందరరెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు ఈ నెల 27, 28, 29 తేదీల్లో డిఇఒ యు.మాణిక్యంనాయుడు సెలవులు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ యాజమాన్య పాఠశాలలు, కళాశాలలు కూడా తెరవకూడదని స్పష్టంచేశారు. ఈ విషయంలో సంబంధిత సమగ్ర శిక్ష అధికారులు, ఉప విద్యాశాఖాధికారులు, ఎంఇఒలు పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల కేంద్రాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటుచేయాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు సంబంధిత పాఠశాలలోనే అందుబాటులో ఉండాలని సూచించారు. డిఇఒ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ : 89785 04260, 94412 85224 ఏర్పాటుచేసినట్లు చెప్పారు.

అప్రమత్తంగా వ్యవహరించాలి

కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి శ్రీనివాస్



విజయనగరంకోట : మొంథా తుపాను తీవ్ర రూపం దాల్చి, రాష్ట్రంలో తీర ప్రాంతంపై విరుచుకుపడే ప్రమాదం ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించాలని విజయనగరం, శ్రీకాకుళం, మన్యం జిల్లాల కలెక్టర్లు, విద్యుత్, రెవెన్యూ, వైద్య, వ్యవసాయ, మత్స్యశాఖల అధికారులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. రైతులు, మత్స్యకారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు విజయనగరం, శ్రీకాకుళం, మన్యం జిల్లాల కలెక్టర్లతో ఆదివారం మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కూటమి కార్యకర్తలు, నాయకులు విపత్తు సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. తుపాను ప్రభావాన్ని ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధమైందని, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు సమాచారాన్ని వీలైనంత వేగంగా చేరవేయాలని మంత్రి ఆదేశించారు. ప్రజలు కంట్రోల్ రూమ్ నంబర్లను వినియోగించుకోవాలని కోరారు.

పోలీసు సిబ్బందికి సెలవులు రద్దు : ఎస్‌పి

కంటోన్మెంట్ : మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు చేస్తున్నట్లు ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ ప్రకటించారు. జిల్లాలో తీర ప్రాంత మండలాలైన పూసపాటిరేగ, భోగాపురం అధికారులను, సిబ్బందిని ముందస్తు చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. తుపాను షెల్టర్లను, సహాయక శిబిరాలను సిద్ధం చేయాలని చెప్పారు. తుపాను తీవ్రతను ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రజలను షెల్టర్లకు, సహాయక శిబిరాలకు తరలించాలని సూచించారు. అవసరం మేరకు జనరేటర్లు, జెసిబిలు, ఎలక్ట్రికల్ రంపాలు, ఇతర సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. తీర ప్రాంత ప్రజలు ఏదైనా సమస్య వస్తే వెంటనే భోగాపురం రూరల్ సిఐ 9121109428, భోగాపురం పోలీస్‌స్టేషన్ సిఐ 9121109445, పూసపాటిరేగ ఎస్‌ఐ 9121109447ను సంప్రదించవచ్చని కోరారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ 08922-224455, 9121109483, 9121109423ను ఏర్పాటుచేశామని చెప్పారు.

పునరావాస కేంద్రాల పరిశీలన

విజయనగరం టౌన్ : మొంథా తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య కోరారు. నగరంలో ఏర్పాటుచేసిన రెండు పునరావాస కేంద్రాలను ఆయన ఆదివారం పరిశీలించారు. మయూరి జంక్షన్ సమీపంలో ఉన్న లార్డ్ కేచనరీ పాఠశాలను, మంగళ వీధిలో ఉన్న పాఠశాలను పునరావాస కేంద్రాలుగా ఏర్పాటు చేశామని చెప్పారు. ముఖ్యంగా ఆయా ప్రాంతాలలో పారిశుధ్య పనితీరు సక్రమంగా ఉండాలని చెప్పారు. పునరావాస కేంద్రానికి చేరుకున్న ప్రజలకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

కార్పొరేషన్ కార్యాలయంలో పిజిఆర్‌ఎస్ రద్దు

తుపాను హెచ్చరికల నేపథ్యంలో కార్పొరేషన్‌లో సోమవారం పిజిఆర్‌ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కమిషనర్ నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేవారం నుంచి పిజిఆర్‌ఎస్ కార్యక్రమం యధావిధిగా జరుగుతుందని తెలిపారు.



రైతుల్లో గుబులు

- అవసరానికి మించిన వర్షంతో ఇక్కట్లు
- పొలాల్లో చేరుతున్న నీరు
- నానుతున్న పంటలు
- వెంటాడుతున్న పంట నష్ట భయం

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపానుతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. తుపాను ప్రభావంతో భారీవర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతుల్లో గుబులు రేపుతోంది. ఇప్పటికే జిల్లాలో పలుచోట్ల మోస్తారు వర్షాలు కురిశాయి. జిల్లాలో అత్యధికంగా ఇప్పటికే పంటలు పండి కోత దశకు చేరుకుంటున్నాయి. ముందుగా ఉబాలు వేసిన చోట వాతావరణ పరిస్థితులను చూసుకొని కోతలకు వెళ్లాలా? వద్దా? అని రైతులు ఊగిసలాటలో ఉన్నారు. ఇలాంటి సమయంలో జిల్లా వ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రధానంగా వరి రైతులు కొంత కలవరపడుతున్నారు.

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈ ఏడాది ఖరీఫ్‌లో 2,58,927 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. జిల్లాలో పంటలు కొన్నిచోట్ల పొట్ట దశ నుంచి పాలు కారే దశకు, మరికొన్నిచోట్ల కోత దశకు వచ్చాయి. మరికొన్నిచోట్ల వారం పది రోజుల్లో వరి కోతలకు రైతులు ఇప్పటికే సిద్ధంగా ఉన్నారు. మరోవైపు వాతావరణంలో మార్పులతో ఇటీవల కాలంలో వరుసగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తరుణంలో బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను రైతుల్లో గుబులు రేపుతోంది. భారీ వర్షాలు కురిస్తే చేతికొచ్చిన పంటంతా నేలపాలయ్యే అవకాశాలు లేకపోలేదని దిగులు చెందుతున్నారు.

పలుచోట్ల వర్షాలు

తుపాను ప్రభావంతో గత మూడు రోజుల నుంచి జిల్లాలో పలుచోట్ల మోస్తారు వర్షాల నుంచి భారీ వర్షాలు పడ్డాయి. జిల్లాలో గత మూడు రోజుల్లో లక్కవరపుకోట మండలంలో 73 మిల్లీమీటర్ల, జామిలో 61.4, శృంగవరపుకోటలో 55.5, గంట్యాడలో 54.6, వేపాడలో 51.6, విజయనగరంలో 47.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మరికొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి.

వ్యవసాయ శాఖ సూచనలు

మొంథా తుపాను నేపథ్యంలో జిల్లాలో వర్షాలు కురుస్తున్న తరుణంలో వరిపంటకు నష్టం వాటిల్లే అవకాశముందని, వ్యవసాయ శాఖ అధికారులు రైతులను అప్రమత్తం చేయాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. ఈ నేపథ్యంలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు సూచిస్తూ వ్యవసాయ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం పంటలు పాలుపోసే దశ నుంచి కోత దశ వరకు వివిధ దశల్లో ఉన్నందున రైతులు తక్కువ కాల పరిమితి గల రకాలు, కోతకు సిద్ధంగా ఉన్న పంటను వర్షాలు తగ్గేవరకు కోయకూడదని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది. పొలాల్లో నిల్వ ఉన్న అధిక నీటిని వెంటనే బయటకు పంపించాలని సూచించింది.

కోతకు ముందు వర్షాలు వస్తే, వరి వెన్నులపై లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపిన ద్రావణంతో పిచికారీ చేయాలని, తడిసిన పనలను ఉప్పు నీటిలో (లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు) ముంచి ఆరబెట్టి చిన్న చిన్న కుప్పలుగా వేయడం ద్వారా గింజలు 10-15 రోజులు పాడవకుండా ఉంటాయని పేర్కొంది. ఉప్పు నీరు వాడటం సాధ్యం కాకుంటే, తడిచిన పనలను కుప్పలుగా వేసి పైభాగంలో ఉప్పు పొడి చల్లాలని సూచించింది. నూర్చిన తరువాత వరి ధాన్యం తడిస్తే, ప్రతి క్వింటా వడ్లకు ఒక కిలో ఉప్పు, 4 కిలోల ఊక లేదా ఎండుగడ్డి కలిపి కుప్పలుగా వేసి వారం రోజులు ఆరనివ్వడం ద్వారా వర్షాల ప్రభావం నుంచి వరి పంటను రక్షించుకోవచ్చని వివరించింది.

నేటి నుంచి భారీ వర్షాలు

- అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దు
- మొంథా తుపానును ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉన్నాం : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో సోమవారం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో తుపాను పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులను అప్రమత్తంగా ఉంటూ, ఎటువంటి విపత్తునైనా ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి నిర్వహించిన అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సాయంత్రం కలెక్టరేట్‌లోని తుపాను కంట్రోల్‌రూమ్‌ను పరిశీలించారు. తుపాను జాగ్రత్తలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తుఫానును ఎదుర్కొనడానికి జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను వివరించారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. పునరావాస కేంద్రాలు సిద్ధంగా ఉంచి, పూరి గుడిసెలలో నివసించే ప్రజలను తుపానుకు ముందుగానే సురక్షిత ప్రదేశాలకు తరలించాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది తమ పరిధిలోనే ఉండే ప్రజలను అప్రమత్తం చేయాలని, సచివాలయాలలో అత్యవసర ఫోన్ నెంబర్లను ప్రకటించాలని ఆదేశించారు. ప్రజలు ప్రవాహాలను దాటకూడదని, అవసరమైతే ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. 27 నుంచి 29 వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు.

రహదారుల శాఖ జాతీయ, రాష్ట్ర రహదారుల అధికారులతో సమన్వయం చేసుకొని రోడ్లను క్లియర్ చేయడానికి అవసరమైన పరికరాలు, యంత్రాలు, వాహనాలతో సిద్ధంగా ఉండాలన్నారు. జలాశయాలు, చెరువుల్లో ఇన్, అవుట్ ఫ్లోలను పర్యవేక్షిస్తూ, ఓవర్ ఫ్లో నివారణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆర్‌డబ్ల్యుఎస్, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలు రక్షిత తాగునీటి సరఫరాకు సిద్ధంగా ఉండాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖలు ఇ-క్రాప్ నమోదు పూర్తి చేసి, పంట నష్టానికి పరిహారం అందించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యా శాఖ వసతిగృహాలలో విద్యార్థులను సురక్షితంగా ఉంచాలని, స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైతే సెలవులు ప్రకటించాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ శాఖ సరఫరా అంతరాయాలు తక్షణమే పరిష్కరించే చర్యలు చేపట్టాలన్నారు.



కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్

జిల్లాలో తుపాను పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో 10 శాఖల సమన్వయంతో ప్రత్యేక డిజాస్టర్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్ రూమ్ ద్వారా తుపాను ప్రభావిత ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ చేసి, తక్షణ సహాయక చర్యలు చేపట్టనున్నారు. డిపిఎం రాజేశ్వరి, కెఆర్‌ఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టర్ మురళి ఇన్‌ఛార్జులుగా రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ, పశుసంవర్ధక, మున్సిపల్, ఆర్‌అండ్‌బి, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, హెల్త్, ఎపిఇపిడిసిఎల్ శాఖల సిబ్బందితో కూడిన ఈ కంట్రోల్ రూమ్ తుపాను ప్రభావం తగ్గే వరకు 24 గంటలు కార్యకలాపాలు కొనసాగిస్తుంది.

నేడు పిజిఆర్‌ఎస్ రద్దు

కంటోన్మెంట్ : జిల్లాలో వాయుగుండం ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారే అవకాశం ఉన్నందున సోమవారం నిర్వహించాల్సిన పిజిఆర్‌ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. వచ్చేవారం నుంచి పిజిఆర్‌ఎస్ కార్యక్రమం యధావిధిగా జరుగుతుందని తెలిపారు. ప్రజలు వాతావరణ శాఖ సూచనలను గమనిస్తూ అవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా ఉండాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

వసతి గృహ విద్యార్థుల సమస్యలపై

చలించిన దాతలు

- కంచాలు, తదితరాల సాయానికి హామీ
- సమస్య పరిష్కరిస్తాం : ఐటిడిపి పిఒ యశ్వంత్‌కుమార్

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై పలువురు దాతలు స్పందించారు. వారికి అవసరమైన కంచాలు, తదితర సదుపాయాల కల్పనకు తమ వంతుగా సాయం అందిస్తామని ప్రజాశక్తికి చెప్పారు. 'మంత్రి ఇలాకాలో కంచాలు కరువు' అనే శీర్షికతో ప్రజాశక్తిలో రాష్ట్ర వ్యాప్త కథనం ఆదివారం వెలువడిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన విశ్రాంత ఎల్‌డిఎం, రోటరీ క్లబ్‌మెంబర్ ఎ.శ్రీనివాసరావు విద్యార్థులకు కంచాలు సమకూరుస్తానని హామీ ఇచ్చారు. మా ఊరు - విజయనగరం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు గుమ్మలూరు విశాలాక్షి కూడా విద్యార్థుల దయనీయ పరిస్థితిపై విచారం వ్యక్తం చేశారు. చాలా వసతి గృహాల్లో ఇటువంటి సమస్యలు ఉన్నాయని, తమ వంతు సాయంగా త్వరలోనే స్పందిస్తామని ప్రజాశక్తికి సమాచారం ఇచ్చారు. ఇంకొంత మంది అయ్యో... పాపం... అంటూ విద్యార్థులపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రజాశక్తితో పంచుకున్నారు. మరోవైపు మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్, ఇన్‌ఛార్జి ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి స్పందించారు. తోణాం తదితర మాస్టల్స్‌లోని సమస్యలపై గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సమగ్ర నివేదిక తెప్పించుకుని, అవసరమైన చర్యలు చేపడతానని ప్రజాశక్తికి సమాచారం ఇచ్చారు.

క్రీడాకారుల జీవితాలతో ఆటలు

- తైక్వాండో అసోసియేషన్‌లో బయట పడ్డ విభేదాలు
- రాష్ట్ర పోటీలకు గుర్తింపు లేదంటూ కార్యదర్శి ప్రకటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలోను, జిల్లాలోను క్రీడాకారుల జీవితాలతో క్రీడా సంఘాలు ఆడుకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్రీడా సంఘాలు మూడు, నాలుగు సంఘాలుగా విడిపోవడంతో ఎవరికి గుర్తింపు ఉందో, ఎవరికి లేదో క్లారిటీ లేకపోవడంతో క్రీడాకారులు చాలా నష్టపోతున్నారు. విజయనగరం జిల్లాలో కూడా తైక్వాండో అసోసియేషన్ మూడు ముక్కలుగా విడిపోయి ఉంది. ఎవరికి వారే తమకే గుర్తింపు ఉందంటూ పోటీలు పెట్టి క్రీడాకారులు నుంచి డబ్బులు చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో శుక్రవారం నుంచి తైక్వాండో అసోసియేషన్ పేరుతో రాష్ట్ర పోటీలు స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. దీనికి అధ్యక్ష, కార్యదర్శులుగా డివి చారి, ఎం.త్రినాధరావు వ్యవహరిస్తున్నారు. అయితే ఈ పోటీలకు ఎటువంటి గుర్తింపూ లేదని,





ఒకే అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురం, విజయనగరంలో జరుగుతున్న రాష్ట్ర పోటీలు

ఇదే అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పోటీలు అనంతపురంలో జరుగుతున్నాయని, వాటికి గుర్తింపు ఉంది తప్ప విజయనగరంలో జరుగుతున్న రాష్ట్ర పోటీలకు గుర్తింపు లేదని, ఇక్కడ ఆడిన క్రీడాకారులు జాతీయ పోటీలకు వెళ్లేందుకు అర్హత ఉండదని రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శి ఎం.త్రినాధరావు ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో అసోసియేషన్ రెండు వర్గాలుగా విడిపోయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరి అధికారం కోసం వారు డబ్బులు కోసం సంఘాలు పెట్టుకొని పోటీలు నిర్వహిస్తే క్రీడాకారులు నష్టపోతున్నారు. ఎంతో కష్టపడి క్రీడల పట్ల ఆసక్తితో ఆడుతున్న క్రీడాకారుల భవిష్యత్‌తో ఆడుకోవడం ఎంత వరకు సమంజసమని క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకే రిజిస్ట్రేషన్ కలిగిన అసోసియేషన్ ఒకేసారి రాష్ట్ర పోటీల పేరుతో రెండు ప్రాంతాల్లో ఎలా నిర్వహిస్తారో చెప్పాలని క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు. ఎవరికి గుర్తింపు ఉందో, ఎవరికి లేదో తేల్చాల్సిన ప్రభుత్వం, ఒలింపిక్ అసోసియేషన్, శాప్ దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే గత ఆరేళ్లుగా క్రీడాకారులు గుర్తింపు లేని సంఘాలు కారణంగా ప్రతిభ కలిగిన క్రీడాకారులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా క్రీడా శాఖ, ప్రభుత్వం స్పందించి క్రీడా సంఘాలు ముక్కలాటలో నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు.



సుఖీభవ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సుఖీభవ ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నగరంలోని బాలాజీ కూడలిలో రిలయన్స్ మార్ట్ సమీపంలో నూతనంగా నిర్మించిన సుఖీభవ ఆస్పత్రిని ఆదివారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్య రంగంలో సుదీర్ఘ అనుభవం కలిగి, సేవలు అందించిన డాక్టర్ శివరాం, డాక్టర్ పిఎస్‌వి రామారావు, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ శరత్ కుమార్ పాత్రో కలిసి ఆసుపత్రిని నిర్మించడం అభినందనీయమన్నారు. ఆస్పత్రి ఎమ్‌డి పిఎస్‌వి రామారావు మాట్లాడుతూ అన్ని రకాల సదుపాయాలతో 100 బెడ్లతో ఆస్పత్రి నిర్మించినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో సుఖీభవ ఆస్పత్రిని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, డాక్టర్ జెసి నాయుడు, కంటి వైద్య నిపుణులు మంచు కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

జానపద కళాకారులకు సత్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని గురజాడ నివాసంలో గిడుగు రామమూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం ఆధ్వర్యంలో జానపద కళాకారులకు ఆదివారం ఆత్మీయ సత్కారం చేశారు. జపాన్‌లో తప్పెటగుళ్లు ప్రదర్శించిన నీలబోని సత్యం, మలేషియాలో తెలుగువారికి చెక్కభజన, కోలాటంలో శిక్షణ ఇచ్చిన గురువులు మచ్చ తవిటినాయుడు, సాయికుమార్, కర్ణాటక, రాజస్థాన్ రాష్ట్రాల్లో తూర్పు భాగవతాన్ని ప్రదర్శించి అవార్డు పొందిన డి.వి.వి. జగన్నాథం పంతులు, బొంతల కోటి శంకర్రావు, కొచ్చర్ల అంజలి భాగవతార్, కొచ్చర్ల లక్ష్మీ భాగవతార్‌ను ఘనంగా సత్కరించారు. డాక్టర్ పి.శంకర్రావు మాట్లాడుతూ జానపద కళలను ముందుకు తీసుకువెళ్లి భావితరాలకు అందించాలని కోరారు. కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు బద్రి కూర్మారావు మాట్లాడుతూ అంతరించిపోతున్న జానపద కళల పునర్జీవనం కోసం 22 ఏళ్లుగా కళాపీఠం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్కృత కళాశాల ప్రిన్సిపల్ జి.జనార్దన్ నాయుడు, ధవళ సర్వేశ్వరరావు, ఈపు విజయ్ కుమార్, జివిఎస్ చలం, చీకటి దివాకర్, జి.వి.శ్రీనివాస్, షేక్ గౌస్ బాషా, డప్పు శ్రీను, ఎన్.చిన్నాదేవి, చంద్రిక రాణి, ఫణిశ్రీ, అట్టాడ లక్ష్మీ నాయుడు, మారినాయుడు, అప్పలరాజు, చింతా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పిఎస్‌టిఎ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్లానింగ్ సెక్రటరీస్ టెక్నికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని వార్డు ప్లానింగ్ సెక్రెటరీస్ అసోసియేషన్‌తో 2023లో ఏర్పడిన పిఎస్‌టిఎ సాధారణ ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్షులుగా పి.శ్రీకాంత్ (విజయనగరం), ప్రధాన కార్యదర్శిగా ఎం.రాజేష్ (బొబ్బిలి), మహిళా అధ్యక్షులుగా వై.ప్రియాంక (సాలూరు), కోశాధికారిగా వి.మణికంఠ (విజయనగరం), ఉపాధ్యక్షులుగా జి.అశోక్ కుమార్ (నెల్లిమర్ల) తోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.



ప్లానింగ్ సెక్రటరీస్ టెక్నికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

అగ్నిప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు


- జిల్లాలో 8 అగ్ని మాపక కేంద్రాల ద్వారా సేవలు
- పూసపాటిరేగలో రూ2.25 కోట్లతో ఫైర్‌స్టేషన్ నిర్మాణం
- అగ్నిమాపక కేంద్రాల్లో సిబ్బంది కొరత
- 'ప్రజాశక్తి'తో డిఎఫ్ఒ బివిఎస్ రామ్ ప్రకాశ్ ముఖాముఖి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో అగ్నిప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి బివిఎస్ రామ్‌ప్రకాశ్ తెలిపారు. నెల్లిమర్ల నియోజకవర్గానికి సంబంధించి పూసపాటిరేగ మండలంలో నూతన అగ్నిమాపక కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 8 అగ్నిమాపక కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. 9 శకటాలు ఉన్నప్పటికీ నాలుగు కాలం చెల్లినవి ఉన్నాయని చెప్పారు. శకటాల్లో నీరు నింపేందుకు ప్రస్తుతానికి ఇబ్బంది లేదని తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి డిఎఫ్ఒ ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా అగ్నిమాపక కేంద్రాల ద్వారా ప్రజలకు ఎలాంటి సేవలు అందిస్తున్నారు, తదితర వివరాలను ఆయన వెల్లడించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

జిల్లాలో ఎన్ని చోట్ల అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి.?

జిల్లాలో విజయనగరం, శృంగవరపుకోట, కొత్తవలస, చీపురుపల్లి, గజపతినగరం, బొబ్బిలి, బాడంగి, రాజాంలో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. ఆ కేంద్రాల ద్వారా అగ్ని ప్రమాదాలు సంభవించే సమయంలో మంటలను అదుపు చేస్తున్నాం.



జిల్లాలో ఎన్ని అగ్నిమాపక శకటాలు ఉన్నాయి.?

జిల్లాలో 9 అగ్నిమాపక శకటాలు ఉన్నాయి. చీపురుపల్లి, గజపతినగరం, శృంగవరపుకోట, కొత్తవలస అగ్నిమాపక కేంద్రాల్లో ఉన్న శకటాలు 15 సంవత్సరాలు దాటి కాలం చెల్లినవిగా ఉన్నాయి. ఆ శకటాలకు మరమ్మతులు చేయించి, ప్రస్తుతానికి వినియోగిస్తున్నాం.

ప్రమాదాలు జరగకుండా ముందస్తు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారా.?

ప్రమాదాలు జరగకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నాం. పాఠశాలలు, కళాశాలలతోపాటు పబ్లిక్ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు, డెమోలు నిర్వహించి అగ్ని ప్రమాదాలు జరిగే సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తున్నాం.

ప్రయివేటు విద్యాసంస్థల్లో, ఆస్పత్రుల్లో అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేస్తున్నారా.?

ప్రతి ప్రయివేటు ఆసుపత్రిలో, పాఠశాలలో కచ్చితంగా అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయాలి. గతంలో విజయనగరం జిల్లా కేంద్రం నుండి ఎన్ఒసిలు ఇచ్చేవారం. ప్రస్తుతం రాష్ట్ర కేంద్రంలోని కార్యాలయం నుంచి అగ్నిమాపక పరికరాలకు సంబంధించిన ఎన్ఒసిలు అందిస్తున్నారు.

అగ్నిమాపక కేంద్రాల్లో సిబ్బంది కొరత ఏమైనా ఉందా.?

జిల్లాలో ఎనిమిది అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. మొత్తం సిబ్బంది 86 మంది ఉండాలి. ప్రస్తుతం 40 మంది సిబ్బంది ఉన్నారు. ఉన్న సిబ్బందితో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. అగ్నిమాపక పరికరాలు ఉన్న వాటితో సేవలు అందిస్తున్నాం. బోట్లు లేవు.

పూసపాటిరేగ మండలంలో నూతనంగా నిర్మిస్తున్న ఫైర్‌స్టేషన్ పనులు ఎంతవరకు వచ్చాయి.?



నెల్లిమర్ల నియోజకవర్గానికి సంబంధించి పూసపాటిరేగ మండలంలో నూతనంగా అగ్నిమాపక కేంద్రాన్ని నిర్మిస్తున్నాం. గతంలో విజయనగరం జిల్లా కేంద్రం నుంచి నెల్లిమర్ల నియోజకవర్గంలో ఎక్కడ అగ్నిప్రమాదం సంభవించినా వెళ్లి మంటలు ఆర్పే వారం. పూసపాటిరేగ మండలంలో అగ్నిమాపక కేంద్రం పూర్తయితే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే అవకాశం ఉంటుంది. పూసపాటిరేగలో నిర్మిస్తున్న అగ్నిమాపక కేంద్రానికి రూ.2.25 కోట్లు మంజూరయ్యాయి. నిర్మాణం స్లాబ్ వరకు వచ్చింది.

డైట్‌లో ఖాళీ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ ఉపాధ్యాయ విద్య శిక్షణ సంస్థ (డైట్) లో ఖాళీ ఉన్న సైకాలజీ 1, ఫైన్‌ఆర్ట్స్ 2 పోస్టులకు డెప్యుటేషన్ పద్ధతిపై (ఫారిన్ సర్వీస్) భర్తీ చేయనున్నట్లు ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఈ నెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె. రామ కృష్ణారావు ఆదివారం ప్రకటనలో కోరారు. ఖాళీగా ఉన్న మూడు పోస్టులకు 2025-26 విద్యాసంవత్సరానికి డెప్యుటేషన్ పద్ధతిపై భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ స్కూల్లో పనిచేస్తున్న అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు ఈ నెల 31 నాటికి 5సంవత్సరాలు స్కూల్ అసిస్టెంట్‌గా పూర్తి చేసిన వారు ఈ నెల 29లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాఠశాల విద్యా సంచాలకుల ఆదేశాల మేరకు లీప్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకొని ఫిజికల్ దరఖాస్తు, అర్హత సంబంధించిన ధ్రువ పత్రాలు జిల్లా విద్యా శాఖ ప్రత్యేక కౌంటర్‌లో 29లోగా అందజేయాలన్నారు. లీప్ యాప్‌లో దరఖాస్తు చేయని వారి దరఖాస్తులు తిరస్కరిస్తామని చెప్పారు.

భూ బదలాయింపుపై అభ్యంతరం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

18 సంవత్సరాల క్రితం జిందాల్ అల్యూమినియం ప్రైవేట్ లిమిటెడ్ కోసం తీసుకున్న భూమిని, భూమి కోల్పోయిన నిర్వాసితుల అనుమతి లేకుండా ఎంఎస్ఎంఇ కోసం ఎలా భూమిని బదలాయిస్తారని జిందాల్ నిర్వాసితులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆదివారం బొడ్డవరలో నిర్వాసితులు మాట్లాడుతూ కంపెనీ కడతానని ఆ రోజు తమ వద్ద తీసుకున్న భూమిని ఎటువంటి కంపెనీ కట్టనందున తిరిగి తమకు వెంటనే అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఎంఎస్ఎంఇ పార్కులు కట్టే ఆలోచన ఉంటే నిర్వాసితుల భూమి తిరిగి నిర్వాసితులకు ఇచ్చి మరలా నిర్వాసితుల నుండి ఇప్పుడున్న రేట్ల ప్రకారం భూమి సేకరించి వారికి నష్టపరిహారం ఇస్తే కానీ అంగీకరించేది లేదని హెచ్చరించారు.

సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని బూరాడ ప్రాథమికోన్నత పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహాన్ని వైస్ ఎంపిపి వావిలిపల్లి జగన్మోహన్‌రావు ఆదివారం ఆవిష్కరించారు. ఆత్మకూరు చిన్నారావు, దమయంతిల కుమారులు సహకారంతో ఈ విగ్రహావిష్కరణ చేసినట్లు తెలిపారు. సరస్వతి దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల విద్యార్థులు ముందుగా పూజించి విద్యను అభ్యసిస్తారని అన్నారు. వీరితో ఉపాధ్యాయులు ఉన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - దత్తిరాజేరు

మండలంలోని దాసుపేటలో పారిశుధ్య పనులను ఆదివారం చురుగ్గా చేపట్టారు. కాలువలో ఉన్న చెత్తను, మురుగును కార్మికులు తొలగించారు. అన్ని వీధిల్లో ఉన్న కాలవలన్నీ శుభ్రం చేశారు. ఆ చెత్తను ట్రాక్టర్‌కు ఎక్కించి చెత్త సంపద కేంద్రానికి తరలిస్తామని తెలిపారు. వీధుల్లో ఎక్కడా చెత్త లేకుండా శుభ్రం చేశారు. వర్షాలు అధికంగా పడడం వల్ల ఎక్కడకక్కడే చెత్త చేరితాదన్న భయంతో ఈ పనులు చేపట్టినట్లు వైసిపి నాయకులు సిరిపురం శంకరరావు తెలిపారు. ప్రజలకు ఎటువంటి అనారోగ్యాలు దరి చేరకుండా ఉండేందుకే కాలువలు శుభ్రం చేశామని చెప్పారు.

జర్నలిస్టులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - వేపాడ

శ్రీవాసవి క్లబ్ ఇంటర్నేషనల్ రాష్ట్ర అధ్యక్షులు ఇరుకుల రామకృష్ణ ఆధ్వర్యంలో 'కలం యోధులకు అభినందన మాల' పేరుతో జర్నలిస్టులకు సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సేవా సంఘం సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్య జర్నలిస్టులు పాల్గొన్నారు. మండలంలోని నీలకంఠరాజుపురం గ్రామానికి చెందిన 'లీడర్' విలేకరి వి.సంపత్‌కుమార్‌కు అవార్డు అందించారు. ఈ కార్యక్రమంలో శైవక్షేత్ర పీఠాధిపతి శివ స్వామీజీ, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు సిఎస్. కుమార్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్‌కుమార్ పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల మృతి దారుణం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గిరిజన విద్యార్థులు మృతి చెందడం దారుణమని జైభీం రావు భారత్ పార్టీ నాయకులు టొంపల నరసయ్య, కనిగిరి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం వారు నెల్లిమర్లలో విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు 21 మంది గిరిజన విద్యార్థులు మృతి చెందారన్నారు. ఈ నెలలోనే మరణించిన విద్యార్థుల సంఖ్య ఆరుకు చేరడం ఆందోళన కలిగిస్తోందన్నారు. గిరిజన గురుకుల సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన వైద్య సదుపాయాలు, విద్యార్థులకు దోమతెరలు సక్రమంగా పంపిణీ చేయకపోవడం, హాస్టల్లో తలుపులు, కిటికీలు లేకపోవడం, తాగునీటి సమస్య, సరైన మెనూ అందించకపోవడం వల్ల గిరిజన విద్యార్థులు మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హడ్డుబంది గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న మండలంగి కవిత(11) జ్వరంతో చనిపోవడం ఈ ప్రభుత్వం దళితులపై ఆదివాసీలపై ఎంత శ్రద్ధ ఉందో అనడానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం వెంటనే కళ్ళు తెరిచి సంబంధ శాఖ మంత్రి, గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని కోరారు.

యువజన సంఘం అధ్యక్షులుగా ఈశ్వరరావు

ప్రజాశక్తి - కొత్తవలస

కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధి పాత సుంకరపాలెం గ్రామంలో ఉన్న శ్రీసిద్ధి వినాయక యువజన సంఘం ఎన్నిక బలిఘట్టం సమీపంలో ఉన్న ప్రగతి క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఆ సంఘం కమిటీ పెద్దలు పెదిరెడ్ల సూరిబాబు (ప్రెస్), బెహరా విష్ణు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌరవ అధ్యక్షులు బెహరా నాగేశ్వరరావు, లెంక ఈశ్వరరావు, బెహరా పరమేశ్వరరావు, బెహరా హరిబాబు, పెదిరెడ్ల సన్యాసి పాత్రుడు, జమ్మల రవి తదితరుల సమక్షంలో ఎన్నిక నిర్వహించామన్నారు. సంఘం నూతన అధ్యక్షులుగా లెంక ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పెదిరెడ్ల నరసింగరావు, కోశాధికారిగా లెంక శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సేవను మించిన సాధన లేదు

ప్రజాశక్తి - మెరకముడిదాం



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

మండలంలో కొండలావేరు పంచాయతీ మధుర గ్రామం బాడాంలో ఆదివారం శ్రీసత్యసాయి అమృత కలశ యజ్ఞంలో భాగంగా చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న 100 మంది పేద కుటుంబాలకు అమృత కలశాలను వితరణ చేశారు. ఇందులో 10 కేజీలు బియ్యంతో పాటు నెలరోజులకు సరిపడా నిత్యవసర సరుకులు ఇచ్చారు. శ్రీ సత్య సాయి సేవా సమితి 'సేవను మించిన సాధన లేదు' అనే నినాదంతో పాటు దయగల హృదయమే దైవ మందిరం అని భావించి బాడాం గ్రామస్తులు సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నసమారాదన చేసినట్లు శ్రీసత్యసేవా సమితి సభ్యులు తెలిపారు.

పఠన పోటీల్లో ప్రథమ స్థానం

ప్రజాశక్తి - డెంకాడ



చిన్నారిని అభినందిస్తున్న స్వామీజీ

చింతల వలస బెటాలియన్ సమీపంలోని చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత పఠన పోటీలలో శ్రీవాణి సంతోష్ హైస్కూల్ విద్యార్థినులు ప్రథమ స్థానం సంపాదించారు. పాఠశాలకు చెందిన యుకెజి విద్యార్థిని ఎల్.విరాద్యకోమల్ ఏ కేటగిరీలో, 3వ తరగతి విద్యార్థిని ఎల్. హస్విత కోమల్ సీ కేటగిరీ లోనూ, 7వ తరగతి విద్యార్థిని పీ.దీపిక ఇ కేటగిరీలో ప్రథమ స్థానంలో నిలిచారు. వీరంతా వచ్చే నెల 9వ తేదీన కడపలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు స్వామీజీ తెలిపారు.

జూదగాళ్లపై కేసు నమోదు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

పట్టణంలోని ఐస్ ఫ్యాక్టరీ కూడలి సమీపంలోని ఒక ప్రయివేటు భవనంలో పేకాట శిబిరంపై ఆదివారం దాడి చేసి ఆరుగురుపై కేసు నమోదు చేశామని టూటౌన్ సిఐ టి. శ్రీనివాసరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.21,830 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నిబంధనలకు 'బోర్' కొట్టారు

◆ప్రజాధనంతో ఎంపిటిసిలకు, బంధువులకు చేతి బోర్లు మంజూరు ◆ క్షేత్రస్థాయిలో పరిశీలించని జిల్లా అధికారులు ◆ అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న ఎంపిపి!

కలెక్టర్ ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారు మండలంలోని అధికారులు. పిజిఆర్ఎస్ ద్వారా చేసుకున్న దరఖాస్తుల పరిష్కారంలో భాగంగా బోర్లను పరిశీలించి ఏడు రోజుల్లోగా నివేదికలు అందజేయాలని జిల్లా అధికారులు ఆదేశించినా.. ఆ ఆదేశాలను తుంగలో తొక్కేశారు. వైసిపి మండల నాయకుడు అధికారులపై జులుం ప్రదర్శిస్తుండటమే అందుకు కారణంగా తెలుస్తోంది. ఇటీవల జిల్లా కలెక్టర్ రామసుందర్ రెడ్డి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినా, మండల అధికారులకు ఇవేవీ పట్టడం లేదు. దీంతో సమస్య పరిష్కారం కాక పిజిఆర్ఎస్‌కు దరఖాస్తులు పునరావృతం అవుతూనే ఉన్నాయి.

ప్రజాశక్తి -వేపాడ

మండలంలో సుమారు 21 చేతిబోర్లు మంజూరయ్యాయి. అందులో 9 బోర్లను నిబంధనలు పక్కనపెట్టి, ఎంపిడిఒ ప్రొసీడింగ్ లేకుండా ఎంపిపి సత్యవంతుడు ఆదేశాల మేరకు ఇష్టానుసారంగా ఏర్పాటుచేశారు. ప్రజావసరాల కోసం ప్రభుత్వ స్థలాల్లో బోర్లు ఏర్పాటు చేయలేదు. ఎంపిటిసిలు, వారి బంధువుల సొంత స్థలాల్లో, కళ్లాల్లో ఈ బోర్లు ఏర్పాటుకు అవకాశం కల్పించారు. అప్పుడున్న ఎంపిడిఒ సూర్యనారాయణ శిక్షణకు వెళ్లిన కాలంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ద్వారా బిల్లుల మంజూరు కోసం ఫైలు తయారు చేయించి, జిల్లా కలెక్టర్‌కు పంపించారు.



నిరుపయోగంగా ఉన్న చేతి బోరు

అంత్యక్రియల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్న శ్మశానవాటికలో, సుమారు 300 మంది చదువుతున్న వసతిగృహంలో చేతి బోరు కావాలని కోరినా పట్టించుకోలేదని పలువురు చెబుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోతాయని జెడ్‌పి చైర్మన్ చెప్పారంటూ ఎంపిపి సత్యవంతుడు.. తమ పార్టీ నాయకులకు ప్రజాధనంతో బోర్లు పంచిన తీరు పట్ల మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సొంత ప్రయోజనాలకు ప్రజాధనంతో చేతి బోర్లు

మండలంలో సుమారు 21 చేతిబోర్లు మంజూరు కాగా అందులో 9 బోర్లను ఎంపిడిఒ ప్రొసీడింగ్ లేకుండా సొంత ప్రయోజనాలకు ఏర్పాటు చేసుకున్నారు. ప్రజాధనం దుర్వినియోగం చేశారు. దీనిపై డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ పర్యవేక్షణలో పరిశీలించాలని పిజిఆర్ఎస్‌లో పలుమార్లు దరఖాస్తు చేశాను. వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. స్థానిక అధికారులు బోర్లన్నీ సక్రమమేనంటూ గొంప కృష్ణకు, దరఖాస్తుదారునికి తెలియకుండా జిల్లా అధికారులకు నివేదిక పంపించారు. అర్జీ పరిష్కారం కాక మరలా దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చింది.

- సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు

బెదిరింపులు కాదు.. పరిష్కారం చూపండి

ప్రజాప్రతినిధులు ప్రజలకు సేవ చేయాలి. వారి పార్టీ నాయకులకు, బంధువులకు కాదు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడవలసిన బాధ్యత అధికారులపైనా ఉంది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీలను పరిష్కరించకుండా అక్రమాలను బయట పెడుతున్నారని దరఖాస్తుదారులను ఇబ్బందులు పెట్టాలనుకుంటే మాత్రం.. చూస్తూ ఊరుకోం. సిపిఎం ఆధ్వర్యాన పోరాటం చేస్తాం.



- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

నేను లేనప్పుడు ప్రొసీడింగ్ ఇచ్చారు

మంజూరైన 21 బోర్లలో 11 బోర్లకు ప్రొసీడింగ్ ఇచ్చాను. మిగిలిన 9 బోర్లకు నేను శిక్షణకు వెళ్లిన సమయంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రవికుమార్ ప్రొసీడింగ్ ఇచ్చారు. జిల్లా అధికారులకు నివేదిక పంపించి వారి సూచనల మేరకు తగు చర్యలు తీసుకుంటాం.

- ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జెవివి, యుటిఎఫ్ ఆధ్వర్యంలో నేషనల్ మీన్స్ కామ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష రాస్తున్న 8 వతరగతి విద్యార్థులకు నియోజకవర్గం స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు ఆదివారం సబ్జెక్టు ఓరియంటేషన్ అవగాహన సదస్సుతో పాటు ఉచిత మెటీరియల్ పంపిణీ చేశారు. జెవివి నాయకులు శశిభూషణరావు, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పాల్గొని మెరిట్ స్కాలర్ షిప్ కోసం ప్రణాళిక బద్ధంగా చదవాలని విద్యార్థులకు సూచించారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగంలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి బహుముఖ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, పదవతరగతి విద్యార్థుల కోసం స్టడీ మెటీరియల్‌తో పాటు మోడల్ టెస్ట్ పేపర్సును ప్రతి సంవత్సరం లక్షల సంఖ్యలో ముద్రించి విద్యార్థులకు పంపిణీ చేస్తున్నామని అన్నారు. చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించి శాస్త్రీయ దృక్పథం పెంపొందించే దానికి కృషి చేస్తున్నామని, ఎన్ఎంఎంఎస్ కేవలం ప్రభుత్వ పాఠశాలలకు కల్పించిన ఈ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్ష రాస్తున్న విద్యార్థుల కోసం 110 పేజీలు పుస్తకాన్ని ముద్రించి ఉచితంగా 8 వతరగతి విద్యార్థులకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు ముట్నూరు వేణు మాట్లాడుతూ ఒక బృహత్తరమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న యుటిఎఫ్, జెవివిలకు అభినందనలు తెలియచేస్తూ విద్యార్థులు పట్టుదలతో చదవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. రామభద్రపురం ప్రధానోపాధ్యాయులు వంగపండు గోపాల్ నాయుడు మాట్లాడుతూ మెటీరియల్ వినియోగించుకుని మెరిట్ స్కాలర్ షిప్‌లు సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రొంపిల్లి హై స్కూల్ హెచ్ఎం ధనుంజయ్, జేజేలు హైస్కూల్ హెచ్ఎం మూర్తి, జ్యోతిరావుపూలే రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ పురుషోది తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్, జెవివి నాయకులు

నిష్ణాతులైన ఉపాధ్యాయులతో..

సదస్సులో గణితం సబ్జెక్టుపై రామారావు, తవిటినాయుడు, రీజనింగ్ పై రమేష్, బైలాజికల్ సైన్స్‌పై స్వామినాయుడు, ఫిజిక్స్ పై మహందాతనాయుడులు అవగాహన కలిగిస్తూ పరీక్షకు ప్రిపేర్ అయ్యే విధానాన్ని వివరించారు. అనంతరం ప్రముఖ విద్యావేత్త, మాజీ శాసనమండలి సభ్యులు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్.లక్ష్మణరావు రూపొందించిన 110 పేజీలు స్టడీ మెటీరియల్ 250 పుస్తకాలను ఉచితంగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 200 మంది విద్యార్థులతో పాటు యుటిఎఫ్ నాయకులు సుధాకర్, శంకర రావు, మహేష్, బేతనబిల్లి రమేష్, సత్యన్నారాయణ, మన్యం జిల్లా నాయకులు మధు, రామకృష్ణ, సత్యన్నారాయణ, జెవివి నాయకులు వాసిరెడ్డి రాంబాబు, రామకృష్ణ, రవీంద్ర, శివకు మార్, కృష్ణదాసులతో పాటు టీచర్లు, పేరెంట్స్ పాల్గొన్నారు.

నేడు ప్రజా దర్బార్

ప్రజాశక్తి - కొత్తవలస

ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించనున్నామని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి జరిగే గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రజలందరూ వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిత్య అన్నదాన కార్యక్రమం ప్రారంభం

స్థానిక మరిడిమాంబ ఆలయ ప్రాంగణంలో ఏటా మణికంఠ సేవా పీఠం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్ర మాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రారంభిం చారు. గొరపల్లి రాము అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు వెంకట రత్నాజీ, పిఎసిఎస్ చైర్మన్ కోళ్ల శ్రీను, డైరెక్టర్ శ్రీను, బొబ్బిలి అప్పారావు మాస్టర్, లెంక శ్రీను, కోరుపోలు అప్పారావు, జనసేన మండల అధ్యక్షులు గొరపల్లి చినబాబు పాల్గొన్నారు.

నేడు తెరవనున్న తాటిపూడి జలాశయం రెండో గేటు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

నేడు తాటిపూడి జలాశయం రెండవ గేటును తెరిచి నీటిని దిగువకు విడుదల చేయనున్నట్లు జిల్లా జల వనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యకిశోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాటిపూడి జలాశయం గరిష్ట నీటి మట్టం 297 అడుగులు కాగా, ప్రస్తుతం 295.80 అడుగులుగా ఉందని, ప్రస్తుతం జలాశయం లోనకి వస్తున్న వరద నీరు సుమారు 3675 క్యూసెక్కులుగా ఉందని చెప్పారు. స్పిల్‌వే గేట్‌ను తెరిచి గోస్తనీ నదిలోకి ప్రస్తుతానికి సుమారు 4257 క్యూసెక్కులు వరద నీరు విడిచిపెట్టామన్నారు. మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం రెండవ గేటు కూడా తెరిచి అవుట్ ఫ్లోను ఇంకా పెంచుతామన్నారు. గోస్తని నది పరివాహక, వరద ప్రభావిత ప్రాంతాలకు సమాచారం అందజేసి అప్రమత్తం చేయాలని కోరారు.

మొంథా తుపానుపై సమీక్ష

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మొంథా తుపాను తీవ్రతను బట్టి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రతి ప్రాణం ముఖ్యమేనని యుద్ధ ప్రాతిపదికన సహాయక బృందాలను సిద్ధం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ఆదేశాలు జారీ చేశారు. నియోజకవర్గంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఆదివారం ఆమె అధికారులతో సమీక్ష సమావేశం ముక్కాంలో నిర్వహించారు. రెవెన్యూ, విద్యుత్, తాగునీరు పంచాయతీ రాజ్, పోలీసు శాఖల ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై దిశానిర్దేశం చేశారు. ప్రజల ఫిర్యాదులు, అత్యవసర పరిస్థితులకు తక్షణమే స్పందించేలా 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్‌లను నియోజకవర్గ స్థాయిలో తక్షణమే ఏర్పాటు చేసి, ప్రజలకు నంబర్లను తెలియజేయాలన్నారు.

వరి కోతలు కొయ్యొద్దు

రేగిడి: మొంథా తుపాను నేపథ్యంలో రానున్న 3 రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, రైతులు వరి కోతలను వాయిదా వేసికోవాలని ఎఒ శ్రీనివాసరావు తెలిపారు. పెద్ద శిర్లాంలో ఆదివారం కోసిన వరి కోతలను ఆయన పరిశీలించారు. వరి కోసిన రైతులు కల్లాల్లోనూ కుప్పలు వేసుకోవాలని కోరారు. పంటలు సురక్షితంగా ఉంచాలన్నారు. అప్రమత్తంతోనే పంటలు కాపాడుకోవాలని సూచించారు. కోసిన వరి చేలు పంట పొలాల్లోనే ఉంచాలంటే కుప్పలు వేసుకొని టార్పాలిన్లు వేయాలన్నారు. పెద్ద శిర్లాం వ్యవసాయ అసిస్టెంట్ ప్రశాంత్ వరి కోతలపై సూచనలు అందించారు.

రేగిడిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మొంథా తుపాను నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంత ప్రజల సౌకర్యార్థం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు తహశీల్దార్ ఐ.కృష్ణలత ఆదివారం తెలిపారు. ఈ నెల 27, 28, 29తేదీలలో జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. నది తీర ప్రాంతాల గ్రామాలలో వరదలు వస్తే ఏమైనా సమస్యలు తలెత్తితే కంట్రోల్ రూమ్ మొబైల్ నెంబర్ 8179086569 తక్షణమే ఫోన్ చేయాలని సూచించారు. గ్రామ రెవెన్యూ అధికారులకు నది పరివాహ గ్రామాలలో ఉండేందుకు డ్యూటీలు వేసామన్నారు. ఈ నాలుగు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.



రేగిడి: రైతులకు సూచనలు చేస్తున్న ఎఒ శ్రీనివాసరావు

అవసరం మేరకు సంకిలి పాఠశాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సంతకవిటి: తుపాను పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ బి.సుదర్శన్ రావు ఆదివారం హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28, 29న భారీ నుండి అతిభారీ వర్షాలు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. అత్యవసరమైతే తప్ప ఇంటి నుండి ఎవరు బయటకు రావద్దు అని చెప్పారు నాగావళి నది తీరంలో వున్న కె.ఆర్‌పురం, రంగరాయపురం, పోడలి, తమరాం, పిజె పేట, చిత్తారిపురం, హోజారాం తదితర గ్రామాల ప్రజలు ఎప్పటికప్పుడు అలెర్ట్‌గా ఉండాలన్నారు. తుపాను ప్రభావం వల్ల ప్రజలకు ఇబ్బంది కలిగితే రెవెన్యూ, పోలీస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు.

అనాథలను ఆదుకుంటున్న వికె ఫౌండేషన్

ప్రజాశక్తి - రామభద్రపురం

అనాథ పిల్లలను తలిదండ్రుల మాదిరిగా ఆదుకుంటున్న వికె పౌండేషన్ సేవలు ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. ఆదివారం స్థానిక మండల కార్యాలయం ఆవరణలో వసుధైక కుటుంబం యూనివర్సిల్ ఫ్యామిలీ ఫౌండేషన్ ప్రతినిధి కొల్లి ఈశ్వరరావు ఆధ్వర్యంలో వికె ఫౌండేషన్ ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికె ఫౌండేషన్, క్రేజీబీ సర్వీసెస్ సహకారంతో విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న అమ్మానాన్న లేని బాలికల చదువు మధ్యలో ఆగకుండా బాలికా విద్యను ప్రోత్సహించటంలో భాగంగా 85 శాతం పైగా మార్కులు సాధించిన 100 మంది బాలికలకు హైస్కూల్ స్థాయిలో నెలకు 1000, ఇంటర్‌లో నెలకు 2000, డిగ్రీ స్థాయిలో నెలకు 3000 చొప్పున ఉపకారవేతనాన్ని అందిస్తుందన్నారు. ఈ సహకారాన్ని బాలికలు వినియోగించుకోవాలని కోరారు. వికె ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం.ప్రతాప్ మాట్లాడుతూ అమ్మానాన్న లేని విద్యార్థినిలకు వికె ఫౌండేషన్ ఆర్థికంగా ఆదుకుంటుందని, విద్యార్థులకు గతంలో 50లక్షల విలువగల 750 సైకిల్స్ ఇచ్చామని గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా మరింతమందికి సాయం చేస్తామని తెలిపారు. 100 మంది బాలికలకు దీపావళి కానుకగా వికె ఫౌండేషన్ బ్యాగులు వితరణ చేసింది. ఈ కార్యక్రమంలో వికె ఫౌండేషన్ ప్రతినిధులు, వాలంటీర్లు సత్యం, రోహిణి, చింతల రాజేశ్వరి, తేజస్విని 3 జిల్లాల విద్యార్థులు, వారి సంరక్షకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

చంద్రంపేట సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి తెలిపారు. ఆదివారం చంద్రంపేట గ్రామానికి చెందిన నాయకులు గ్రామ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముక్కాంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే లోకం నాగ మాధవిని కలిశారు. ఈ సందర్భంగా వారు శిథిలావస్థలో ఉన్న అంగన్వాడీ భవనం, తాగునీరు, విద్యుత్ సమస్యలు ఉన్నట్లు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి అంగన్వాడీ భవనం తరలింపు, తాగునీరు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా శిథిల భవనం నుండి అంగన్వాడీ కేంద్రాన్ని ఒక వారం రోజుల్లోగా కొత్తగా మంజూరైన భవనంలోకి తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇళ్లలో తాగునీటి సరఫరా సరిగా లేకపోవడంపై ప్రజలు ఫిర్యాదు చేయగా, గ్రామీణ నీటి సరఫరా పథకం డిప్యూటీ ఇంజనీర్‌తో మాట్లాడి, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాల మార్పిడికి సంబంధించిన సమస్యను కూడా పరిష్కరించాలని విద్యుత్ శాఖ డిప్యూటీ ఇంజనీర్‌కు సూచించారు. ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నగర పంచాయతీలో లక్ష్మీగణపతి వరాహి ఫుడ్స్ రెస్టారెంట్‌ను ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, లోకం ప్రసాద్ దంపతులు ఆదివారం ప్రారంభించారు. జనసేన పార్టీ సీనియర్ నాయకులు రవ్వా నానికి చెందిన రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన రెస్టారెంట్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. దీని ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్ పర్సన్ బంగారు సరోజినీ, జనసేన పార్టీ నాయకులు చనమల్ల వెంకటరమణ, అంబళ్ల అప్పలనాయుడు, యడ్ల గోవిందరావు, ఎంఎం నాయుడు, కరుమజ్జి గోవిందరావు, పతివాడ అచ్చం నాయుడు, జనా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి

15 బోర్లు ప్రారంభం

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ గ్రామంలో విశాఖ డెయిరీ సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన కంటైనర్ పార్లర్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను, బల్లంకి గ్రామంలో ఏర్పాటు చేసిన 15 బోర్లను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశాఖ డైరీ డైరెక్టర్ కాటమయ్య, టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణ మూర్తి, మహిళ అధ్యక్షులు గుమ్మడి భారతి, ఎంపిటిసి గొంప తులసి, అధ్యక్షులు పోతల వెంకటరమణ, గోగాడ జగన్నాథం నాయుడు, మాజీ ఎంపిటిసి నిరుజోగి అమ్మతల్లి నాయుడు, నిరుజోగి బంగారు నాయుడు, భోజంకి లక్షణ్ రావు, గొర్రిపోటు రాము, గోకేడ నాగభూషణ్, విశాఖ డైరీ సూపర్‌వైజర్ నాయుడు, బల్లంకి వేపాడ పాల సంఘం ప్రెసిడెంట్లు నాగిరెడ్డి నాయుడు, డేగల ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ గొర్లి నాగరాజు, వైస్ సర్పంచ్ ధనుంజయ్, వైసిపి నాయకుడు బల్లంకి కనకరాజు, మాజీ ఎంపిటిసి వి.జగ్గుబాబు పాల్గొన్నారు.

టెట్ నిర్ణయాన్ని ఉపసంహరించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ నిర్వహించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకాడమిక్ కన్వీనర్ జెసి రాజు డిమాండ్ చేశారు. స్థానిక ఎపిటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఆయన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్నీ యాజమాన్య పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు టెట్ నిర్వహించాలని నిర్ణయం చేయడంతో ఉపాధ్యాయులు ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు అప్పటి ప్రభుత్వం నిర్ణయం బట్టి డిఎస్‌సి పరీక్షలు రాసి అర్హత సాధించి ఉద్యోగాలు సాధిస్తే నేడు టెట్ నిర్వహిస్తామని చెప్పడం అన్యాయమన్నారు. టెట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎపిటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల స్ఫూర్తితో గురుకుల పాఠశాల దత్తత

ప్రజాశక్తి - బొబ్బిలి

పూర్వ విద్యార్థుల స్ఫూర్తితో గురుకుల పాఠశాలను దత్తత తీసుకున్నట్లు ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. పట్టణ సమీపంలో ఉన్న గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థులు రూ.10లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల స్ఫూర్తితో పాఠశాలను దత్తత తీసుకున్నట్లు చెప్పారు. పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరుకు ప్రతిపాదనలు చేశామన్నారు. అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గురుకుల పాఠశాల రూపురేఖలను మారుస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి పని చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన నెహ్రూ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘునాథ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

వ్యాను దగ్ధం

ప్రజాశక్తి - రామభద్రపురం



దగ్ధమైన వ్యాను

మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకును ఢీకొని ఐసర్ వ్యాను పూర్తిగా దగ్ధమైంది. పోలీసుల కథనం ప్రకారం విజయనగరం నుంచి సాలూరు వైపు గోనె సంచుల లోడుతో వెళుతున్న వ్యాను సాలూరు నుంచి రామభద్రపురం వస్తున్న బైకును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. పాచి పెంట మండలం గడివలస గ్రామానికి చెందిన బెవర అప్పలనాయుడు అపాచీ ద్విచక్ర వాహనంపై బాడంగి మండలం రౌతువానివలస అత్తారింటికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న వ్యక్తి తుల్లి పక్కన పడిపోగా బైక్ వ్యాను కింద ఉండిపోవడంతో మంటలు చెలరేగి వ్యాను పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో బైకిస్టుకు గాయాలు కావడంతో 108లో బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ వ్యాన్లో ఉన్న ఇద్దరు కూడా ప్రమాదం నుంచి బయట పడ్డారు. సమాచారం అందిన వెంటనే బాడంగి ఫైర్ ఆఫీసర్ రాంసూర్యారావు ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి మంటలని అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ఆదివారం మధ్యాహ్నం వరకు మంటలు అదుపులోకి రాలేదు. ఎస్ఐ వెలమల ప్రసాదరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

పెంకుటిల్లు దగ్ధం

రామభద్రపురం: మండల పరిధిలోని కొట్టక్కి గ్రామంలో ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఒక పెంకుటిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదానికి విద్యుత్ షార్ట్ షర్క్యూటే కారణమని భావిస్తున్నారు. పెద్దాడ సాయిరాజ్ ఇంటిలో ఫ్రిజ్ ఒక్కసారిగా పేలిపోవడంతో ఒక్కసారిగా మంటలు ఇళ్లంతా వ్యాపించాయని తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలక్ట్రికల్ సామాన్లు, బట్టలు, కొంత మేర నగదు కాలిపోయాయని బాధితుడు సాయిరాజ్ తెలిపాడు. సమాచారం అందుకున్న సాలూరు ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటల్ని అదుపులోకి తెచ్చారు. ఎస్ఐ వెలమల ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఈ అగ్ని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.0